సాక్షి
జగిత్యాల
శనివారం । 21 । జనవరి । 2023



గోదావరికి మొక్కులు

ధర్మపురి: వేలాది మంది భక్తులు శుక్రవారం గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు.



ఉద్యోగులుగా గుర్తించండి

జగిత్యాలఅగ్రికల్చర్: తమను ఉద్యోగులుగా గుర్తించాలని పశుమిత్రలు డిమాండ్ చేశారు.

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

రైతులదే విజయం

- ముసాయిదా మాస్టర్ ప్లాన్ రద్దు
- మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం
- కొత్త బృహత్ ప్రణాళిక తయారీకి ప్రత్యేక కమిటీ
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



మున్సిపల్ కార్యాలయం ఎదుట పోలీసు బందోబస్తు



తీర్మానం కాపీ చూపుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి

జగిత్యాల: మున్సిపల్ జారీచేసిన ముసాయిదా మాస్టర్ ప్లాన్ రద్దు లక్ష్యంగా జగిత్యాల పట్టణ శివారులోని ఆయా గ్రామాల రైతులు సుమారు పదిరోజుల పాటు ఉధృతంగా పోరు చేసి విజయం సాధించారు. బృహత్ పట్టణ ప్రణాళికలో హస్నాబాద్, తిప్పన్నపేట, మోతె, తిమ్మాపూర్, ధరూర్, నర్సింగాపూర్ గ్రామాల్లో విలువైన, అన్నదాతలకు బతుకుదెరువునిచ్చే వ్యవసాయ భూములు చేర్చుతూ బల్దియా పాలకవర్గం ఇటీవల నోటిఫికేషన్ జారీచేసింది. రిక్రియేషన్, ఇండస్ట్రియల్, కమర్షియల్ తదితర జోన్లలో భూములు చేర్చడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువైన భూములను ప్రభుత్వం లాగేసుకుంటే తాము బతికేదెలా? అని పేర్కొంటూ వేలాది మంది రైతులు ప్రత్యక్ష ఆందోళనలకు దిగారు. దిగివచ్చిన మున్సిపల్ పాలకవర్గం శుక్రవారం అత్యవసరంగా సమావేశమైంది. ప్రజలు, రైతులకు సంతృప్తి ఇవ్వని ముసాయిదా మాస్టర్ ప్లాన్ రద్దు చేసేందుకు ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఏకగ్రీవంగా తీర్మానం..

- పట్టణ శివారు కాలనీల్లోని ప్రజల్లోంచి మాస్టర్ ప్లాన్‌పై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ పాలకవర్గం అత్యవసరంగా సమావేశమైంది. జగిత్యాల ముసాయిదా మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. సుమారు పదిరోజులుగా ప్రజల్లోంచి నిరసనలు వ్యక్తం కావడం, అధికారులు, ప్రజాప్రతినిధులు 60 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరిస్తామని ప్రకటించడం.. అయినా, ఆందోళనకారుల్లో నమ్మకం రాకపోవడంతో పోరు ఉధృతంగా సాగింది. రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జోక్యం చేసుకుని ప్రజలు, రైతులకు న్యాయం చేస్తామని, ఎవరికీ నష్టం కలిగించబోమని బహిరంగంగా ప్రకటించారు. అయినా, రైతులు, ప్రజల్లో నమ్మకం ఆశించిన స్థాయిలో రాలేదు. దీంతో మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తామని బహిరంగా పేర్కొన్నారు. ఆ తర్వాత మున్సిపల్ అత్యవసర సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. తీర్మానం కాపీని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ)కి పంపిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీ నివాస్, కమిషనర్ నరేశ్, కౌన్సిల్ సభ్యులు తదతరులు పాల్గొన్నారు.

అన్నదాతల్లో ఆగ్రహ జ్వాలలు

- జిల్లా కేంద్రంతోపాటు సమీపంలోని వివిధ గ్రామాల వ్యవసాయ భూములను ముసాయిదా మాస్టర్ ప్లాన్ పరిధిలోకి తెస్తూ రిక్రియేషన్, ఇండస్ట్రియల్, కమర్షియల్ వంటి జోన్లుగా విభజించారు.
- ఈమేరకు గత డిసెంబర్ 15వ తేదీన జీవో నంబరు 238 జారీ చేశారు.
- తమ భూములు కోల్పోతున్నామనే ఆవేదనతో అన్నదాతలు నిరసనలు తెలిపారు.
- విలువైన వ్యవసాయ భూముల క్రయ, విక్రయాలకు ఇది తీవ్ర ఆటంకం కలిగిస్తోందని ధ్వజమెత్తారు.
- డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి మూకుమ్మడిగా ఆయా గ్రామాల్లో నిరసనలు వ్యక్తం చేశారు.
- కొందరు ఆత్మహత్యకు యత్నిస్తే.. మరికొందరు సర్పంచులు తమ పదవులకూ రాజీనామా చేశారు.
- ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆందోళనకారులకు మద్దతు ప్రకటించడంతో పాలకవర్గం దిగివచ్చింది.

కార్యాలయం ఎదుట బందోబస్తు..

- పాలకవర్గం అత్యవసర సమావేశం కావడంతో రైతులు ఆందోళనలు తీవ్రతరం చేస్తారనే ముందస్తు సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కార్యాలయం ఎదుట సీఐ కిశోర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట..

- రైతుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై రైతులు కొద్దిరోజులుగా ఆందోళనలు, నిరసనలు చేస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ముసాయిదా మాస్టర్ ప్లాన్ రద్దుకు తీర్మానించామని చెప్పారు. రైతులకు అన్యాయం జరగనివ్వబోమని, ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందరికీ మద్దతుగా ఉంటుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు రైతులను తప్పుదారి పట్టించాయని ఆయన విమర్శించారు.

మాస్టర్ ప్లాన్ రద్దుకు నిర్ణయం తీసుకున్నాం..

జగిత్యాల మున్సిపల్ ముసాయిదా మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకున్నాం. కౌన్సిల్ సమావేశంలో చర్చించాం. మాస్టర్ ప్లాన్ రద్దుకు ఏకగ్రీవంగా తీర్మానించాం. కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఓ కమిటీ నియమించాం. అన్నదాతలు ఎవరూ ఆందోళన చెందవద్దు. – భోగ శ్రావణి, మున్సిపల్ చైర్‌పర్సన్, జగిత్యాల

స్వాగతిస్తున్నాం : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేస్తూ బల్దియా తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. అయితే, రైతుల్లో ఆందోళన తొలగించేలా తుది నోటిఫికేషన్ జారీచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

న్యూస్‌రీల్

శ్రీవేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం



ముస్తాబైన శ్రీస్వామివారు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రంగుల పూలతో చూడముచ్చటగా అలంకరించారు. అర్చకుడు శ్రీనివాసచార్యులు మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ హవన కార్యక్రమం నిర్వహించారు.

హ్యాండ్‌బాల్ టోర్నీకి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ చదువుతున్న మధు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థి మధు ఫిబ్రవరి 4 – 8వ తేదీ వరకు తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో జరిగే టోర్నీలో పాల్గొంటాడు. ప్రిన్సిపాల్ అశోక్ ఆ విద్యార్థిని శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కరుణాకర్, సందీప్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితేనే లక్ష్యం చేరుకోవచ్చు



పోటీలు ప్రారంభిస్తున్న నారాయణ

రాయికల్(జగిత్యాల): సరైన ప్రణాళికతో చదివితేనే నిర్దేశిత లక్ష్యం సాధించవచ్చని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఆయన క్రీడా పోటీలు ప్రారంభించారు. విద్యార్థులు కృషి, పట్టుదల, సరైన ప్రణాళికతో చదివి ఉన్నత స్థానాలు చేరాలని సూచించారు. ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీధర్, ఇమ్రాన్‌ఖాన్, చౌడారపు శ్రీనివాస్, రాజమౌళి, రవీందర్, దేవేందర్, రాజేంద్రప్రసాద్, గంగారెడ్డి, రహీం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

పనుల పూర్తిపై దృష్టి



పనులు పరిశీలిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: మన ఊరు.. మన బడి ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ధరూర్ కాలనీలోని పాఠశాలను పరిశీలించారు. కిచెన్, టాయిలెట్స్, కాంపౌండ్‌వాల్ పనులను వేగంగా పూర్తిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్‌రావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

జగిత్యాలటౌన్: పెంచిన వేతనాల తాలూకు బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో పారిశుధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఉదయం 5గంటలకు విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వారు మాట్లాడుతూ 2021 జూన్‌లో వేతన పెంపు అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. జనవరి 2022 నుంచి మాత్రమే పెరిగిన వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. 6నెలల వేతన బకాయిలు చెల్లించాలని అధికారులను వేడుకున్నా ఫలితం లేదని అన్నారు. చెత్త వాహనాలను వదిలేసి బల్దియా ఎదుట నిరసన తెలిపారు. కమిషనర్ నరేశ్ వచ్చి ఎరియర్స్ చెల్లిస్తామని భరోసా ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

వేగవంతంగా ఆధార్ అనుసంధాన ప్రక్రియ



మాట్లాడుతున్న కలెక్టర్ రవి

జగిత్యాల: జిల్లాలో ఓటరు.. ఆధార్ అనుసంధానం ప్రక్రియను నిర్దేశిత గడువులోగా వేగవంతంగా పూర్తిచేస్తామని కలెక్టర్ రవి అన్నారు. తుది ఓటరు జాబితా ప్రగతిపై రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శుక్రవారం ఆయా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మనజిల్లా కలెక్టర్ రవి మాట్లాడుతూ, జిల్లాకు కొత్త ఎపిక్ కార్డులు చేరాయన్నారు. వీటిని పోస్ట్ ఆఫీస్ ద్వారా అందరికీ పంపిణీ చేస్తున్నామని వివరించారు. అంతకు ముందు వికాస్‌రాజ్ మాట్లాడుతూ, వచ్చే 15 రోజుల్లో ఓటరు జాబితాలోని పీఎస్‌ఈ ఎంట్రీలు వందశాతం క్షేత్రస్థాయిలో పూర్తిచేయాలన్నారు. ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. 'మై భారత్ హూ' పేరిట రూపొందించిన పాటను గ్రామ పంచాయతీలు, ఎన్నికల కేంద్రాల్లో వినిపించాలని సూచించారు. అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించాలని, 80ఏళ్ల వయసు పైబడిన ఓటర్లు, కొత్త ఓటర్లను ఇదే వేదికపై సన్మానించాలని సూచించారు. ఈ ఏడాది ఓటరు దినోత్సవం 'థీమ్ నథింగ్.. లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్' ప్రకారం ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మాధురి, వినోద్‌కుమార్, డీఆర్డీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రవేశాలకు ఎంపిక పోటీలు

జగిత్యాలటౌన్: 'స్పోర్ట్స్' అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఖేలో ఇండియా సెంటర్(హైదరాబాద్)లో ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి నరేశ్ శుక్రవారం తెలిపారు. హైదరాబాద్ జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఈనెలతోపాటు ఫిబ్రవరి ఒకటోతేదీన పోటీలు ఉంటాయన్నారు. 12 – 18ఏళ్ల వయసు గల క్రీడాకారులు అర్హులన్నారు. అయితే, విలువిద్యలో పాల్గొనేందుకు 12–18ఏళ్ల వయసు కలిగిన బాలికలు మాత్రమే అర్హులని వివరించారు. అథ్లెటిక్స్, హాకీ, జిమ్నాస్టిక్స్‌లో బాలబాలికలకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు.. కబడ్డీ విభాగంలో బాలురకు మాత్రమే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలల పనితీరు సంతృప్తికరం

- సమగ్ర శిక్షా జేడీ రాజీవ్



దోనూర్‌లో వసతులు పరిశీలిస్తున్న జేడీ రాజీవ్

ధర్మపురి: ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి ఎంపికైన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పనితీరు ఎంతో బాగుందని సమగ్ర శిక్షా జాయింట్ డైరెక్టర్ పెగుంట రాజీవ్ సంతృప్తి వ్యక్తం చేశారు. దోనూర్ ప్రభుత్వ ప్రాథమిక, దొంతాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. తొలుత పాఠశాలల దరఖాస్తుల్లో పొందుపరిచిన అంశాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా పాఠశాలల్లో కల్పించిన వసతులు, సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాల తీరు తదితర అంశాల గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన తీరు బాగుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు.. మనబడి కార్యక్రమం ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి బత్తుల భూమయ్య, ప్రధానోపాధ్యాయులు కాశెట్టి రమేశ్, అంజయ్య, సీఆర్పీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

వెల్గటూర్(ధర్మపురి): ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియాకు ప్రాథమికంగా ఎంపికైన వెల్గటూర్ ప్రభుత్వ ఉన్నత, కొత్తపేట ప్రాథమిక పాఠశాలలను సమగ్ర శిక్షా రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ పి.రాజీవ్ సందర్శించారు. ఈ పథకం కోసం ఎంపిక కావడానికి పాఠశాలలు పొందుపర్చిన అంశాలపై ఆయన ఆరా తీశారు. 60 శాతానికి పైగా అనుకూల పరిస్థితులు ఈ పాఠశాలలకు ఉన్నట్లు ఆయన తెలిపారు. మొత్తం మండలంలో 13 పాఠశాలలు ప్రాథమిక స్థాయిలో ఈ పథకానికి ఎంపికయ్యాయని ఆయన వివరించారు. పాఠశాల భవనం, విద్యార్థుల హాజరు నమోదు తీరు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి వసతి, చేతుల శుభ్రత, సురక్షిత పాఠశాల వంటి అంశాలపై ఆరా తీశారు. పథకం కింద ఎంపికైతే ఐదేళ్ల వ్యవధికి కార్పొరేట్ వసతుల కల్పన, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ లైబ్రరీలు, సైంటిఫిక్ ల్యాబొరేటరీలు, వృత్తిపరమైన ప్రయోగశాలలు, ప్లాస్టిక్ రహిత ఆహ్లాదకరమైన వాతావరణం, శుద్ధజలం, నాణ్యమైన విద్య, ఇంటర్నెట్ సదుపాయం, నైపుణ్యాల అభివృద్ధి, ఆరోగ్య కార్యక్రమాలు వంటివి సమకూరుతాయని రాజీవ్ వివరించారు. ఆయన వెంట మండల విద్యాధికారి భూమయ్య, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పద్మలత, ప్రణీత, ఉపాధ్యాయులు ఉన్నారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



అటుకులు తింటున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మేడిపెల్లి(వేములవాడ): గల్ఫ్‌కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే బడ్జెట్‌లో రూ.వంద కోట్లు కేటాయించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గల్ఫ్‌లో ఇటీవల మృతిచెందిన భీమారంలోని జుపాల గణేశ్ కుటుంబాన్ని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. విద్యారంగంలో గల్ఫ్ కార్మికుల పిల్లలకు 5శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, లచ్చానాయక్, బక్కురి నరేశ్, మల్లేశం, వినయ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భీమారంలోని ఓ హోటల్‌లో అల్పాహారం చేసిన ఎమ్మెల్సీ.. అందులో అటుకులు భలే టేస్టీగా ఉన్నాయని సంబురపడ్డారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.

రోళ్లవాగు ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించండి



రోళ్లవాగు ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న నాయకులు, కార్యకర్తలు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): రోళ్లవాగు ప్రాజెక్టు ఆయకట్టుకు ఈయాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, రైతు ఐక్యవేదిక జిల్లా మాజీ అధ్యక్షుడు పన్నాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బీర్‌పూర్ శివారుల్లోని రోళ్లవాగు ప్రాజెక్టు కట్ట పునరుద్ధరణ పనులను ఆయన కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. రైతులకు గడచిన ఖరీఫ్, ప్రస్తుత యాసంగి పంటలకు పరిహారం అందించాలని ఆయన మాట్లాడుతూ, భారీవర్షాలతో కట్ట తెగి, సాగు నీరు అందక పంటలు నష్టపోయిన అన్నదాతలకు గత వానాకాలం, ఈ యాసంగికి పరిహారం చెల్లించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన మరమ్మతు పనుల తీరు పరిశీలిస్తే ఈ యాసంగికి కూడా సాగునీరు అందే అవకాశం కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద యాసంగి వరినాట్లు వేసుకోవాలని అధికారులు, పాలక పార్టీ నాయకులు పదేపదే చెప్పారని, వారి మాటలు నమ్మి రైతులు వరినార్లు పోశారని తెలిపారు. ప్రస్తుతం సాగునీరు అందక నాటువేసిన పొలాలు, నార్లు ఎండిపోతున్నాయని చెప్పారు. దీనికి పూర్తిబాధ్యత ప్రభుత్వానిదేనని హెచ్చరించారు. యాసంగి పంటలకు సాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయంగా ఎస్సారెస్పీ ద్వారా ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన కాలువల్లోకి నీటిని మళ్లించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పెద్దగా వ్యయం చేయాల్సిన అవసరం కూడా లేదని చెప్పారు. అధికారులు స్పందించకపోతే ఈనెల 21న తుంగూర్‌లో ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. అయినా స్పందన లేకపోతే కలెక్టరేట్ ముట్టడికి వెనుకాడమని అన్నారు. నాయకులు మ్యాడ జనార్దన్, ఆడెపు రమేశ్, అప్పాల జలేందర్, బుట్ల మార్కండేయ, ఆడెపు సత్యం, మ్యాకల మల్లేశ్, పూదరి శ్రీనివాస్, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, బందెల మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లకు కొత్త సొబగులు!

- కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లకు మహర్దశ
- ప్రత్యేక ప్రణాళిక ద్వారా అభివృద్ధి చేయనున్న ద.మ. రైల్వే
- ఏయే సదుపాయాలు కల్పించవచ్చో అధ్యయనం
- అమృత్ భారత్ కింద ప్రతీ స్టేషన్‌కు రూ.20 కోట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దక్షిణ మధ్య రైల్వే తన పరిధిలో ఉన్న స్టేషన్ల ఆధునికీకరణకు చర్యలు చేపడుతోంది. ఇటీవల సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో ఉన్న అన్ని స్టేషన్లలో ట్రాకుల సామర్థ్యం గంటకు 130 కి.మీ మేరకు పెంచిన విషయం తెలిసిందే. తాజాగా తన పరిధిలో ఉన్న మొత్తం 20 స్టేషన్లలో ఆధునికీకరణ పనులు చేపట్టి, కావాల్సిన సదుపాయాలు కల్పించేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే సమాయత్తమవుతోంది. సదరు 20 స్టేషన్ల జాబితాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల స్టేషన్లు కూడా ఉన్నాయి. ఈ స్టేషన్లలో ప్రయాణికులకు ఏయే సదుపాయాలు కల్పించవచ్చో గుర్తించే పనిని టెండర్లు సొంతం చేసుకున్న టెక్నికల్ కన్సల్టెన్సీలు గుర్తించి, దక్షిణ మధ్య రైల్వేకు అందజేస్తాయి. సదరు నివేదికల ఆధారంగా కావాల్సిన సదుపాయాలు, పనులను ద.మ.రైల్వే చేపడుతుంది.

ఉమ్మడిజిల్లాలో మూడు స్టేషన్లు..!

- ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లు కీలకమైనవి. ఇందులో పెద్దపల్లి, రామగుండం నిత్యం రద్దీగా ఉండే స్టేషన్లు.
- రాష్ట్రంలో తిరిగే రైళ్లతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ తదితర ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లేందుకు ఈ రూటు ప్రధానం.
- ఇటీవల ఈ మార్గంలో మూడో రైలు మార్గం కూడా అందుబాటులోకి వచ్చింది. అలాగే.. ఈ మార్గంలో 130 కి.మీ వేగంతో వందేభారత్ రైలు వెళ్లేలా పట్టాల సామర్థ్యాన్ని దక్షిణ మధ్య రైల్వే అప్‌గ్రేడ్ చేసింది.
- తాజాగా స్టేషన్లలో సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టడం శుభపరిణామం అని పలువురు ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు.
- కన్సల్టెన్సీలు ఇచ్చే నివేదికల ఆధారంగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు ఉన్నతాధికారులు చర్యలు చేపడతారు.
- వీటి ప్రకారం.. స్టేషన్ల సుందరీకరణ, గోడలపై స్థానిక కళారూపాలు, చిత్రాలు వేయడం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సైనేజ్ బోర్డులు, రెస్ట్ రూములు, వెయిటింగ్ రూములు, అదనపు, కౌంటర్లు, బెంచీలు, పార్కింగ్, లైటింగ్, హైలెవల్ ప్లాట్ ఫారాలు, రైళ్ల రాకపోకలను తెలిపే డిజిటల్ బోర్డులు, దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు తదితరాలు కల్పిస్తారు.
- ముఖ్యంగా కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం లేదు. అలాగే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేదు. ఈ సదుపాయాల కోసం కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఈ సదుపాయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.
- ప్రతీ ఆదివారం, గురువారం కరీంనగర్ నుంచి తిరుపతికి బయల్దేరే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ చాలా రద్దీగా ఉంటోంది. ప్రయాణికులతోపాటు వారి బంధువులతో ఆ రెండు రోజులు స్టేషన్ కిక్కిరిసిపోతోంది.
- ఒకటే ప్లాట్‌ఫారంతో ప్రయాణికులు, వారి బంధువులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిన వారి కష్టాలు చెప్పతరం కావు.



అమృత్ భారత్ కింద అభివృద్ధి..

అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజునవేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మిషన్) పథకం కింద దేశంలోని 1000 చిన్న రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయాలని కేంద్రం ఇటీవల నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన స్టేషన్లలో ప్రయాణికులకు కనీసం సదుపాయాలు కల్పించేలా వాటికి అవసరాన్ని బట్టి రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లు కేటాయించనుంది. కన్సల్టెన్సీలు పని పూర్తిచేసిన అనంతరం వాటి నివేదిక ఆధారంగా సదుపాయాల కోసం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లకు కనీసం రూ.30 కోట్ల నుంచి రూ.60 కోట్లు కేటాయించే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా అనేక రైల్వేస్టేషన్ల ముఖద్వారాల నిర్మాణం, అదనపు భవనాల నిర్మాణం, అవసరమైతే కారాల్యాలయాల తరలింపు కూడా చేపడతారు.

వేగంగా కొత్తపల్లి- మనోహరాబాద్ పనులు..

హైదరాబాద్–కరీంనగర్‌ను కలిపే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కొత్తపల్లి–మనోహరాబాద్. ఈ రైల్వే లైను ఇప్పటికే మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు పూర్తయ్యింది. సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల నుంచి వేములవాడ వరకు పనులు వేగంగా నడుస్తున్నాయి. సిరిసిల్ల డివిజన్‌లోని తంగళ్లపల్లి వద్ద తమకు 37 ఎకరాలు కావాలని దక్షిణ మధ్య రైల్వే కోరగా సిరిసిల్ల కలెక్టర్ కేటాయించారు. ఈ భూమి కేటాయింపులు ఇటీవల పూర్తయ్యాయి. మరోవైపు తంగళ్లపల్లి నుంచి కొత్తపల్లి వరకు భూసేకరణ పనులు నడుస్తున్నాయి.

క్లుప్తంగా

కంటి వెలుగు శిబిరం సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రవి

మల్యాల(చొప్పదండి): మ్యాడంపల్లి గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం కలెక్టర్ రవి సందర్శించారు. కంటి పరీక్షలు, సౌకర్యాల కల్పన తీరుపై ఆరా తీశారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీధర్, సర్పంచ్ రౌతు గంగామహేశ్వరి, మాజీ సర్పంచ్ రవివర్మ, ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు ఎంపీడీవో శైలజారాణి, తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలు అభినందనీయం


వైద్యశిబిరం ప్రారంభిస్తున్న అతిథులు

గొల్లపల్లి(ధర్మపురి): ఎల్‌ఎం కొప్పుల సోషల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, ఆశ్రమ హ్యాండ్ ఆఫ్ హోప్, హైదరాబాద్ మెగా వైద్య శిబిరాలతో పేదలకు సేవలు చేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ మకరంద్ అన్నారు. చిల్వకోడూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం చేపట్టి మెగా వైద్య శిబిరాన్ని మకరంద్, ఎల్‌ఎం కొప్పుల సోషల్ సీర్వస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత ప్రారంభించారు. అనంతరం మకరంద్ మాట్లాడారు. ఉచిత సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ మహబూబ్, జెడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ సక్క శంకర్, ఏఎంసీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు, వైస్ చైర్మన్ లింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

జగిత్యాలటౌన్: లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా మాలోతు సురేందర్‌నాయక్‌ను నియమించారు. ఈమేరకు స్టేట్ చీఫ్ కో ఆర్డినేటర్ జాదవ్ రమేశ్, అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రాయికల్ మండలం దావన్‌పెల్లికి చెందిన సురేందర్ నాయక్ విద్యావంతుడిగా, గిరిజనుల హక్కుల సాధన కోసం పోరాడారని పేర్కొనానరు. ఆయన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు వారు తెలిపారు. సురేందర్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర కార్యవర్గం సూచనల మేరకు కృషి చేస్తానన్నారు.

ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్ల డిమాండ్లు నెరవేర్చాలి


మద్దతు తెలుపుతున్న తిరుపతి

మంథని: ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్ల డిమాండ్లను యాజమాన్యాలు నెరవేర్చాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాపెల్లి తిరుపతి డిమాండ్ చేశారు. అద్దె బస్సుడ్రైవర్ల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. శుక్రవారం మంథనిలోని డ్రైవర్లను కలిసి మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్లతో సమానంగా అద్దె బస్సుడ్రైవర్లు పని చేస్తున్నారన్నారు. ఆర్టీసీ డ్రైవర్లకు చెల్లించిన విధంగానే వేతనంతో పాటు పీఎఫ్, వైద్యం, బస్‌పాస్ సౌకర్యం కల్పించాలన్నారు.

'రైతుబంధు' కోసం నిరీక్షణ!

- జిల్లాలో 6,468మంది కొత్త రైతులు


దుక్కి దున్నుతున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో రైతుబంధు పథకం ద్వారా రైతులకు ఎకరాపై రూ.5 వేల పెట్టుబడి సాయం అందిస్తూ వస్తోంది. ఈ సొమ్మును నేరుగా అన్నదాతల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. అయితే, వివిధ కారణాలతో కొందరికి ఈ సొమ్ము అందడంలేదు. దీనికితోడు, కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన వారికి ఈసారి యాసంగి రైతుబంధు అందని పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సాయం కోసం అన్నదాతలు వ్యవసాయ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయడం నిత్యకృత్యమైంది.

అందిన రైతుబంధు రూ.188.76 కోట్లు..

- యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుబంధు డబ్బును గత డిసెంబర్ చివరి వారం నుంచి రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేస్తూ వస్తున్నారు.
- ఒక ఎకరం విస్తీర్ణం నుంచి ఎంతఎక్కువ భూమి ఉంటే, ఆ మేరకు రైతుబంధు డబ్బులు జమచేస్తున్నారు.
- సంక్రాంతి పండుగకు ముందు.. వారంరోజుల పాటు డబ్బులు పెద్దగా జమ కాలేదు.
- కేవలం నాలుగు ఎకరాలు ఉన్నవారికే రైతుబంధు జమకావడంతో మిగతా రైతులు ఆందోళన చెందారు.
- అయితే, సంక్రాంతి వరకు అందరు రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అవుతాయని వ్యవసాయమంత్రి ప్రకటించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.
- జిల్లాలో ఇప్పటివరకు యాసంగి సీజన్‌కు సంబంధించి సుమారు 2.11 లక్షల మంది రైతులకు సంబంధించి దాదాపు రూ.188.76 కోట్లు జమయ్యాయి.
- వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం.. జిల్లాలో 2.15 లక్షల రైతులకు సంబంధించి, రూ. 206.88 కోట్లు రైతుబంధు రావాల్సి ఉంది.

బ్యాంకు వివరాలు అందించని 7,643 మంది

రైతుల ఖాతాల్లోకి రావాల్సిన రైతుబంధు నిధులు వివిధ కారణాలతో ఆగిపోతున్నాయి. ముఖ్యంగా, భూమి ఉన్న రైతు చనిపోవడం, ఎప్పటికప్పుడు బ్యాంకు అకౌంట్లను మార్చుకోవడం, బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేకపోవడం, బ్యాంకులు విలీనం కావడంతో ఐఎఫ్‌సీ ఖాతాలు మారడం, బ్యాంకు అకౌంట్లలో నెలల తరబడి లావాదేవీలు లేకపోవడంతో బ్యాంకర్లు ఆ ఖాతాలు మూసివేయడం, బ్యాంకు అకౌంట్లలో ఉండాల్సిన మినిమమ్ బ్యాలెన్స్‌ను ఉంచకపోవడంతో ఖాతాలు రద్దు అవుతున్నాయి. ప్రభుత్వ ఖాతా నుంచి రైతుల ఖాతాల్లో నేరుగా రైతుబంధు డబ్బులు జమచేసేటప్పుడు ఇలాంటి సమస్యలతో డబ్బులు ఆగిపోతున్నాయి. ఇప్పటివరకు బ్యాంకు ఖాతా వివరాలు సరిగ్గా ఇవ్వని 7,643 మంది రైతులకు చెందిన రైతుబంధు డబ్బులు ఆగిపోయాయి.

కొత్త రైతులకు నిరాశే..

- ఇటీవల కొత్తగా భూములు కొనుగోలు చేసి, పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన పలువురు రైతులకు రైతుబంధు నిధులు రాక నిరాశే మిగిల్చే అవకాశం ఉంది.
- జిల్లాలో 6,468 మంది కొత్త రైతులు ఉండగా, వారిని రైతుబంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతించడం లేదు.
- దీంతో, కొత్త రైతులు ఇచ్చిన దరఖాస్తులు ఏఈవో స్థాయిలోనే పెండింగ్‌లో ఉంటున్నాయి.

పట్టాదారులు 2,31,151మంది..

- జిల్లాలో 2,31,151 మంది పట్టాదారులు ఉండగా, గత వానాకాలం సీజన్‌కు సంబంధించి 2,13,527 మంది పట్టాదారులకు రైతుబంధు డబ్బులు అందాయి. అయితే, గత సీజన్‌కు సంబంధించి 394 మంది రైతుల డబ్బులు వివిధ కారణాలతో బ్యాంకులో క్రెడిట్ కాకుండా నిలిచిపోయాయి. పాత పట్టాదారులైన 766 మంది బ్యాంకు వివరాలు సరిగ్గా ఇవ్వక రైతుబంధు సొమ్ము నిలిచిపోయింది.

కొత్త రైతుల వివరాలు

మండలం	రైతులు
జీర్‌పూర్	100
బుగ్గారం	180
ధర్మపురి	352
గొల్లపల్లి	452
ఇబ్రహీంపట్నం	296
జగిత్యాలఅర్బన్	179
జగిత్యాలరూరల్	491
కథలాపూర్	297
కొడిమ్యాల	421
కోరుట్ల	439
మల్లాపూర్	433
మల్యాల	459
మేడిపల్లి	326
మెట్‌పల్లి	607
పెగడపల్లి	440
రాయికల్	362
సారంగాపూర్	195
వెల్గటూర్	439

జూన్‌లో దరఖాస్తు చేశా

నేను రెండు ఎకరాల రెండు గుంటలు భూమి ఇటీవల కొనుగోలు చేశా. పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చింది. రైతుబంధు కోసం వ్యవసాయాధికారులకు ఏడెనిమిది నెలల క్రితం దరఖాస్తు చేశా. ఈ యాసంగి సీజన్‌కు ఇస్తున్న రైతుబంధు సొమ్ము నాకు ఇంకా రాలే.

– నరసాని లక్ష్మి, రైతు, కొత్త దాంరాజ్‌పల్లి, మల్లాపూర్

అనుమతి రాగానే పంపిస్తాం

ప్రస్తుత యాసంగికి సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కొత్త రైతుల వివరాలు రైతుబంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తాం. జిల్లాలో 6 వేల మంది రైతులు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన వారు ఉన్నారు. వీరికి కూడా రైతుబంధు వర్తించేలా చూస్తాం.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

మహిళ హత్య కేసులో యావజ్జీవం

జగిత్యాలజోన్/కోరుట్ల: మహిళను హత్య చేసిన కేసులో అల్లెపు ఎల్లయ్యకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదుగంటి బాల త్రిపురసుందరి కథనం ప్రకారం.. జిల్లాలోని మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన దండుగుల పోచయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె పోశాని ఉన్నారు. పోశానికి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం తర్వాత భార్యాభర్తలు విడిపోయారు. పోశానికి తండ్రి మరో పెళ్లి చేశారు. ఆమెకు కూతురు పుట్టిన తర్వాత భార్యాభర్తలు విడిపోయారు. దీంతో పోశాని కట్లకుంటలోనే తన తండ్రి పోచయ్య వద్ద ఉంటూ కూలీ పనులు చేస్తోంది. ఈ నేపథ్యంలో 2017 జూన్ 23వ తేదీన మేడిపల్లిలో పనిఉందని ఇంట్లోంచి వెళ్లిన పోశాని రాత్రి అయినా ఇంటికి చేరుకోలేదు. ఆమె సెల్‌కు ఫోన్ చేయడంతో ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. బంధుమిత్రులకు సమాచారమిచ్చిన కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో గాలించారు. అయినా, ఆచూకీ లభించలేదు. మూడు రోజుల తర్వాత కోరుట్ల మండలం మోహన్‌రావుపేట శివారులో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు వెళ్లి చూడగా తన కూతురు పోశాని అని తండ్రి గుర్తించారు. ఈక్రమంలో కోరుట్ల పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలి గడియారం, సెల్‌ఫోన్ సంఘటన స్థలంలో కనిపించలేదు. మృతదేహం కుళ్లిపోవడంతో అక్కడే పంచనామా చేశారు. మృతురాలి శరీరంపై బలమైన గాయాలు కావడంతోనే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. కోరుట్ల సీఐ రాజశేఖర్‌రాజు సవాల్‌గా తీసుకుని కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి మొబైల్ నబర్ ఆధారంగా కాల్‌రికార్డ్ పరిశీలించారు. అందులో ఒకే నంబరు నుంచి పలుమార్లు ఫోన్లు రావడం, ఆ రోజే పోశాని మృతిచెందడంతో ఫోన్ చేసిన వ్యక్తే పోశానిని హత్య చేసినట్లు పోలీసులు భావించారు. పలుమార్లు విచారణ జరిపి.. మేడిపల్లి మండలం కట్లకుంటకు చెందిన అల్లెపు ఎల్లయ్య ఈ హత్య చేశాడని నిర్ధారించారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ టీం సభ్యులు ఎం.కిరణ్‌కుమార్, బి.రాజు సాక్ష్యాలు ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన తర్వాత అల్లెపు ఎల్లయ్యకు యావజ్జీవ శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

నాటుసారా విక్రేతకు ఏడాది జైలు


తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట భీంసింగ్

కథలాపూర్(వేములవాడ): ఇప్పపెల్లి గ్రామానికి చెందిన నాటుసారా విక్రేత గుగ్లావత్ భీంసింగ్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాలు ఇచ్చారని ఆబ్కారీశాఖ సీఐ రాధ శుక్రవారం తెలిపారు. భీంసింగ్ గతంలో నాటుసారా విక్రయిస్తే పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు. బైండోవర్ నిబంధన ఉల్లంఘించి మళ్లీ నాటుసారా విక్రయిస్తుండగా పట్టుకున్నామని వివరించారు. ఈ మేరకు శుక్రవారం కథలాపూర్‌లో తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుటు హాజరుపరచగా... ఏడాదిపాటు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు. ఈమేరకు భీంసింగ్‌ను కరీంనగర్ జైలుకు తరలించామని సీఐ వివరించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మల్యాల(చొప్పదండి): అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు మనస్తాపం చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన లంబాడిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. లంబాడిపల్లి గ్రామానికి చెందిన గుర్రం సుశీల భర్త ఏడాది క్రితం మృతిచెందాడు. అప్పట్నుంచి సుశీల మానసికంగా కుంగిపోయి, అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న పీడీఎస్ బియ్యం

కోరుట్ల: కల్లూరు శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఎస్ఐ సతీశ్ శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న కోరుట్లకు చెందిన పేర్ల వెంకటస్వామి, డ్రైవర్ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు ఉన్నారు.

రామాజీపేట గ్రామంలో ఇసుకడంప్ స్వాధీనం


సీజ్ చేస్తున్న మైనింగ్ అధికారులు

రాయికల్(జగిత్యాల): రామాజీపేట గ్రామంలో ఇసుక డంప్‌ను శుక్రవారం మైనింగ్ అధికారులు ఇసుక డంప్ గుర్తించారు. సుమారు 46 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక సీజ్ చేశారు. దానిని తహసీల్దార్‌కు అప్పగించినట్లు జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి


సమ్మయ్య (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం గ్రామం వద్ద మంథని– పెద్దపల్లి ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని తూర్పాటి సమ్మయ్య (70) మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. సమ్మయ్య తన కుమార్తె లావణ్యను పెద్దపల్లి నుంచి గుండారం తీసుకొస్తున్న క్రమంలో వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సమ్మయ్య, లావణ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమ్మయ్య పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని ఎస్సై షేక్‌మస్తాన్ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్‌నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఇద్దరు ఉపాధ్యాయులు

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వశాస్త్ర సాంకేతికశాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు జిల్లాకు చెందిన ఇరువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, రామగిరి మండలం వాణి హైస్కూల్ ఫిజిక్స్ టీచర్ కొండిన్యలు శనివారం నుంచి భోపాల్‌లో జరిగే సైన్స్‌ఫెస్టివల్‌లో పాల్గొంటున్నారని వివరించారు. వారికి ఐఐఎస్ఎఫ్ నుంచి ఆహ్వానాలు అందాయన్నారు. ఈనెల 21నుంచి 24వరకు మౌలానా ఆజాద్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆవరణలో ఈ ఫెస్టివల్ జరుగుతుందన్నారు. ఆటలు బొమ్మల ద్వార విజ్ఞానం ఎగ్జిబిషన్ స్టాల్‌లో కొండిన్య, మెంటరింగ్, కౌన్సిలింగ్ విభాగంలో జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు పాల్గొంటారని పేర్కొన్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
95055 14424, 99124 40790
గమనిక : అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

పదోన్నతుల్లో ప్రాధాన్యం ఇవ్వండి

సారంగాపూర్(జగిత్యాల): ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడం స్వాగతించాల్సిన అంశమని, అయితే, ఈ ప్రక్రియలో జీవో నంబరు 317 ఆధారంగా స్థానికతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐయిల్నేని నరేందర్‌రావు, కార్యదర్శి వొడ్నాల రాజశేఖర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. జీవో నంబరు 317 ప్రకారం గతంలో బదిలీలు పొందని వారిని గుర్తించి ప్రస్తుత బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కోర్టు ద్వారా న్యాయమైన, వ్యక్తిగతంగా వచ్చిన అప్పీళ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించి వెబ్ కౌన్సెలింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు సాంకేతికంగా ఏమైనా పొరపాట్లు దొర్లితే వాటిని సవరించుకోవడానికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని వారు విన్నవించారు. ఈ సమావేశంలో నాయకులు గుడిసె పూర్ణచందర్, ఏలేటి రాజేంద్రప్రసాద్, బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు, మాదాసు ప్రదీప్‌కుమార్, శ్రీనివాస్‌రావు, సంతోష్, రమాదేవి పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంపొందించాలి

- డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి


పనులు పరిశీలిస్తున్న డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి

పెగడపల్లి(ధర్మపురి): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. బతికపల్లి, మద్దులపల్లి ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మన ఊరు–మనబడి పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. తరగతుల నిర్వహణ, విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న తీరు, పాఠశాలల ఆవరణలో పారిశుధ్యం నిర్వహణ తదితర అంశాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ప్రతీ విద్యార్థికి ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం నేర్పాలని సూచించారు. భాషా పరిజ్ఞానంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ఈనెలాఖరు లోపు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శోభారాణి, అనూష, ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎంలు రవీందర్, సత్యనారాయణ, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ రాధ తదితరులు పాల్గొన్నారు.

మా నాన్నకు ప్రాణభిక్ష పెట్టండి

- 20 రోజులుగా కదలలేని స్థితిలోకి యువకుడు
- పాడయిన రెండు కిడ్నీలు
- వైద్యానికి రూ.10లక్షలు ఖర్చు అవుతుందన్న వైద్యులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్


సాయమందించాలని వేడుకుంటున్న భార్య, పిల్లలు

కోనరావుపేట(వేములవాడ): రోజు కూలి పనులు చేసుకుంటూ భార్య, ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్న యువకుడు అకస్మాత్తుగా అనారోగ్యంబారిన పడ్డాడు. ఆస్పత్రికి వెళ్తే రెండు కిడ్నీలు పాడయ్యాయని తెలిసింది. వైద్యానికి చేతిలో చిల్లిగవ్వలేని అతనికి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన మాందాల సంతోష్(28) గ్రామంలోనే కూలి పనులు చేసుకుంటూ భార్య మమత, ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్నాడు. ఉన్నట్టుండి సంతోష్ అనారోగ్యానికి గురికాగా అతని భార్య మమత కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు రెండు మూత్రపిండాలు పాడయ్యాయని, ఖరీదైన వైద్యం చేయించాలని సూచించారు. ఇందుకు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వివరించారు. దీంతో చేసేదేమీలేక భర్తను ఆస్పత్రిలోనే ఉంచి తాత్కాలికంగా డయాలసిస్ అందిస్తోంది.

ప్రాణభిక్ష పెట్టండి

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు.. కూలి పనులు చేసి మమ్మల్ని పోషించే భర్త చికిత్సకు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని మమత తెలిపింది. వారికి ఇద్దరు కూతుళ్లు. ఏమిచేయాలో అర్థంకాక 20 రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. దాతలు ఆదుకుని తన భర్త ప్రాణాలు కాపాడాలని మమత వేడుకుంటోంది.

సంతోష్ గూగుల్ పే, ఫోన్‌పే నంబర్ : **86868 61639**